# రాజకీయ సంక్షోభం-అత్యంత తీవ్రంగా వ్యక్తమవుతున్నది

## సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి తీర్మానం - ఫిబ్రవరి, 2018

**సోషలిజానికి** కాలం చెల్లిందనీ, పెట్టుబడిదారీ విధానమొక్కటే ప్రజలకు మిగిలిన వ్యవస్థ అనీ పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతినిధులు, ప్రచారకులు యింటి పైకప్పులెక్కి ప్రచారం చేస్తున్నారు. ఐనా, పెట్టుబడిదారీ విధానం తన సహజమైన అంతర్గత రుగ్మతలను, వైరుధ్యాలను, సంక్షోభాలను, వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేక పోతున్నది. ఒక సంక్షోభంనుండి మరింత లోతైన మరో సంక్షోభంలో కూరుకుపోతూ వస్తున్నది. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థకు నాయకులమనీ, సంరక్షకులమనీ చెప్పుకొంటూ వస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులు ఎన్నో సంక్షోభాలనెదుర్కొన్నారు. 2008 సంక్షోభం నుండి వారింకా తేరుకోలేదు. ఆంతరంగికంగా తీవ్రమైన నిరుద్యోగ సమస్యలను, ఆర్థిక, సాంఘిక అసమానతలను, వైషమ్యాలను, జాతి వివక్షలను, హింసాతత్వాలను, చర్యలను, అసంతృప్తులను ఎదుర్కొంటున్నారు. అమెరికా సామ్రాజ్యవాదులు గత దశాబ్దకాలంలో అమలు జరిపిన ఆర్థిక, రాజకీయ, మిలిటరీ వ్యూహాలు, దురాక్రమణపూరిత దండయాత్రలు – ప్రతి ఘటనలను, ప్రతికూలతలను ఎదుర్కొన్నాయి. మిలిటరీ విజయాలు సాధించాననుకొన్న ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియా తదితర దేశాల్లో కూడా అమెరికా రాజకీయ ఆధిపత్యం యింకా స్థిరత్వాన్ని సంపాదించలేదు. టెర్రరిస్టు గ్రూపులను, మిలటరీ చర్యలను ప్రయోగించి సిరియాను పాదాక్రాంతం చేసుకోవాలని ఆశించిన అమెరికాకు సిరియా ప్రజలనుండి గట్టి ప్రతిఘటన, రష్యానుండి బలమైన సవాలు ఎదురయ్యాయి. అణ్వాయుధాలు ఉత్పత్తి చేస్తున్నారని ఆరోపించి, ఆర్థికంగా దిగ్బంధించి ఇరాక్‌ను లొంగదీసుకొనడానికి అమెరికా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తానే ఒక మెట్టు దిగిరాక తప్పలేదు. పదేళ్ల అమెరికా దురాక్రమణ యుద్ధం తర్వాత కూడా ఆఫ్ఘనిస్తాన్‌లో దాదాపు సగభాగం తాలిబాన్ల ఆధీనంలో వుంది. అక్కడి ప్రభుత్వం ప్రతిదినం తాలీబాన్ల దాడులకు గురవుతూ విలవిల్లాడుతున్నది. నూతన వ్యూహం పేరిట ఆఫ్ఘనిస్తాన్‌కు మరిన్ని సేనలను పంపాలని అమెరికా యిటీవల తీసుకొన్న నిర్ణయం, ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా దురాక్రమణ వ్యూహం ఎదుర్కొంటున్న సంక్షోభానికే నిదర్శనం. ఆసియా –పసిఫిక్ తీరప్రాంతంపై ఆధిపత్యంకోసం అమెరికా అమలు జరుపుతున్న వ్యూహం ఈ ప్రాంతదేశాలనుండి, ప్రత్యేకించి చైనానుండి వ్యతిరేకతలను, అవరోధాలను ఎదుర్కొంటున్నది. అమెరికా–దక్షిణకొరియాలో, జపాన్‌లో, హిందూ మహాసముద్ర దీవుల్లో దశాబ్దాలుగా సైనిక స్థావరాలు కొనసాగిస్తున్నది. ఇది ఈ ప్రాంతంలో అశాంతికి, అభద్రతకు, ఉద్రిక్తతలకు బలమైన కారణంగా వుంది. ట్రంప్ కాలంలో దక్షిణ కొరియాలో అత్యాధునిక, విధ్వంసకర ఆయుధాల మోహరింపులు, ఉత్తరకొరియాకు వ్యతిరేకంగా కవ్వింపులు, బెదిరింపులు, ఆధిపత్య ధోరణుల విన్యాసాలు బాగా పెరిగాయి. ఉత్తర కొరియా దురాక్రమణ నుండి దక్షిణకొరియాను కాపాడడానికే యిదంతా అని అమెరికా చెప్పి నప్పటికీ, ఈ ప్రాంతంలో తన జోక్యాన్ని, ఆధిపత్యవాద కార్యకలాపాలను సమర్థించు కొనడానికి యిది అమెరికా చూపుతున్న ఒక సాకు మాత్రమేనన్నది వాస్తవం. దాడి చేస్తే దానికి ధీటుగా సమాధానం చెప్పడానికైనా, చర్చలకైనా సిద్ధమేనని ఉత్తరకొరియా ప్రభుత్వం తెగేసి చెప్పడం; అమెరికా దూకుడుకు ఈ ప్రాంతంలో మద్దతు లభించకపోవడం అమెరికా ఆధిపత్య ధోరణికి ఒక పెద్ద సవాలుగా పరిణమించింది. మరీ ముఖ్యంగా, దక్షిణకొరియా ఒలంపిక్ ఆటల పోటీల సందర్భంగా ఉత్తరకొరియా ప్రభుత్వం ప్రయోగించిన శాంతిదౌత్యం, రెండు దేశాల ప్రజల హృదయాల్లో గూడు కట్టుకొని వున్న బలమైన శాంతి ఆకాంక్షలను, పునరైక్యతా వాంఛలను తట్టిలేపాయి. రెండు దేశాల ప్రభుత్వాల మధ్య సంబంధాలు, చర్చలక్రమం మొదలయ్యాయి. అమెరికాతో కూడా చర్చలకు సిద్ధమే అని ఉత్తరకొరియా ప్రభుత్వం ప్రకటించడం దౌత్యపరంగా అమెరికా సామ్రాజ్యవాదులకు ఒక దెబ్బే.

ఆంతరంగికంగా ప్రజలెదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేకపోతున్న జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల సామ్రాజ్యవాద పాలకులు, ప్రజల దృష్టిని పక్కదారిపట్టించడానికి టెర్రరిస్టు ప్రమాదబూచిని చూపెడ్తున్నారు; ఫాసిస్టు శక్తులను ప్రోత్సహిస్తున్నారు. మరోవైపున ప్రజలపై ఫాసిస్టు అణచివేతలను ముమ్మరం చేస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదులకు – యితర సామ్రాజ్యవాదులకు మధ్య వైరుధ్యాలు తీవ్రతర మవుతున్నాయి. ప్రపంచదోపిడీ పెత్తనాలలో "సముచిత" వాటాకోసం అమెరికాతో పోటీ పడడానికి ఇతర సామ్రాజ్యవాద దేశాలు సిద్ధపడుతున్నాయి.

రష్యా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం, ప్రభావిత ప్రాంతాలకోసం గతంలో కన్నా ఎక్కువ ఘర్షణపూరితంగా వ్యవహరించడాన్ని చూడగలం.

అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్య విధానాలు అన్నిచోట్లా పీడిత ప్రజల నిరసనను, వ్యతిరేకతను, ప్రతిఘటనను ఎదుర్కొంటున్నాయి.

పెట్టుబడిదారీ మార్గంలో సాగుతున్న చైనా ఒక పెద్ద ఆర్థికశక్తిగా ముందుకు వచ్చింది. ఆసియా – పసిఫిక్ ప్రాంతంలో అమెరికాతో తలపడడానికి అవసరమైన సన్నాహాలతో, విధానాలతో పనిచేస్తున్నది.

ప్రపంచంలో శ్రామికవర్గం, పీడిత ప్రజలు, సామ్రాజ్యవాద వ్యతిరేక, ఆధిపత్యవాద వ్యతిరేక, శాంతికాముకశక్తులు తమ మధ్య ఐక్యతను పెంపొందించుకొనడానికి, పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి నేటి రాజకీయ పరిస్థితులు ఎంతో అనుకూలంగా

వున్నాయి. వివిధ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు తమ అనైక్యతలను, బలహీనతలను తొలగించుకొని, చొరవగా కార్యాచరణలోకి కదిలినప్పుడే అవి ఈ పోరాటాలకు నాయకత్వం అందించగలుగుతాయి. ముందుకు నడిపించగలుగుతాయి.

భారతదేశంలో, కాంగ్రెసు, యుపిఎ పాలన పట్ల ప్రజల్లో పెరిగిన అసంతృప్తిని సొమ్ము చేసుకొని బిజెపి, ఎన్‌డిఎ కేంద్రంలో అధికారం చేజిక్కించుకొన్నాయి. ఈ ప్రభుత్వం గత నాలుగేళ్ళకాలంలో భూస్వామ్య, బడాబూర్జువా వర్గాలకు, సామ్రాజ్యవాదులకు పూర్తి విధేయతతో వూడిగం చేసింది. అదే సమయంలో హిందూత్వపేరిట ఫాసిస్టు తరహా పద్ధతులను బిజెపి, సంఘపరివార్‌శక్తులు దూకుడుగా అమలుజరిపాయి. దేశంలో హిందూమతోన్మాద, అభివృద్ధి నిరోధక, అరాచకశక్తులు స్వైరవిహారం చేశాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో శాస్త్రీయ, ప్రగతిశీల, హేతువాద, ప్రజాతంత్ర భావాలుగల అనేకులపై హంతకదాడులు జరిగాయి. భిన్నమైన సిద్ధాంతాలను, అభిప్రాయాలను సహించకపోవడం, వారిపై భౌతికదాడులకు పాల్పడడంలాంటి ఫాసిస్టు ధోరణిని ఒక విధానంగా, సంస్కృతిగా బిజెపి, సంఘపరివార్ శక్తులు అమలుజరిపారు. గోరక్షణ పేరిట దళితులపైన, ముస్లిం ప్రజలపైన విచ్చలవిడిగా వీరు దాడులు చేశారు. ప్రజల వేషభాషలను, ఆహార అలవాట్లను, జీవన శైలులను దౌర్జన్య పూరితంగా నియంత్రించడానికి, తలవంచని వారిని తామెంచుకొన్న పద్ధతుల్లో శిక్షించడానికి పూనుకున్నారు.

ప్రజల ప్రజాతంత్ర హక్కులను కాల రాయడానికి మరింత కఠినమైన నిర్బంధ చట్టాలు తెచ్చారు. పాశవిక అణచివేత పద్ధతులను అమలుజరిపారు.

'మేక్ ఇన్ ఇండియా' పేరుతో, పెట్టుబడు లను ఆకర్షించడం అనే పేరుతో భారతదేశ గేట్లను పూర్తిగా ఎత్తివేశారు. 'మా దేశానికి పెట్టుబడులతో రారండహో' అంటూ స్వయంగా ప్రధానియే దేశదేశాల్లో ప్రచారం సాగించాడు. కూలీలను, నిపుణులను, ఇంధనాలను, భూమి, నీరు, మార్కెట్టు తదితర వనరులను కారుచవగ్గా, పుష్కలంగా అందిస్తామంటూ విదేశీ పెట్టుబడి దారుల నోరూరించే రీతిలో ఒక సాధారణ విక్రేత స్థాయికి దిగి వివరించడానికి పూనుకొన్నాడు. ఒకదేశ ప్రభుత్వాధినేత ఈవిధంగా దయనీయంగా దేబిరించడం నిజంగా అవమానకర స్థితి.

అమిత్‌షా బిజెపి అధ్యక్ష పదవిని చేపట్టిన తొలి ప్రసంగంలోనే "కాంగ్రెస్ ముక్త భారత్" బిజెపి లక్ష్యం అని ప్రకటించాడు. కాంగ్రేసేతర పార్టీలకు యిది అప్పటికి వూరడింపుగా వుండ వచ్చును. కాని బిజెపియేతర ప్రభుత్వాల నన్నింటినీ దింపివేయాలన్నదే బిజెపి లక్ష్యం. ఎక్కడ, ఏది సాధ్యం; ఎవరు ముందు, ఎవరు తర్వాత; ఎక్కడ, ఏక్రమం తీసుకోవాలి; ఒక పార్టీని అధికారం నుండి దింపివేయడానికి తాత్కాలికంగా ఏ పార్టీ లేదా ఏ సెక్షను సహాయం తీసుకోవాలి; ఏ పార్టీని, ఏ సెక్షనుని, ఏ నేతను ఎలా ఆకట్టుకోవాలి; లోబరుచుకోవాలి; యిబ్బందుల్లో పెట్టాలి; ఎలా అడ్డుతొలగించు కోవాలి అనేవి బిజెపి ఎత్తుగడల్లో ఒక భాగం. బిజెపిని బలపరుస్తున్న ప్రభుత్వాలను అస్థిర పరచడం కూడా బిజెపి లక్ష్యంలో ఒక భాగం. కేంద్రంలో తమ అధికారాన్ని, ఆర్థిక వనరులను, సిబిఐ, అవినీతి నిరోధక, తదితర విభాగాలను -రాష్ట్రాల్లో తమ రాజకీయ ప్రాబల్యాన్ని పెంచు కొనడానికి, అధికారాన్ని కైవసం చేసుకొనడానికి వినియోగించుకొనడంలో కాంగ్రెసుపార్టీ కన్నా కొన్ని ఆకులు ఎక్కువ చదివినట్లుగా బిజెపి నాయకులు వ్యవహరించారు; వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో జెడియు-ఆర్‌జెడి ప్రభుత్వం కూలి పోయి, బిజెపి-జెడియు ప్రభుత్వం బీహార్‌లో ఏర్పడింది.తమిళనాడులో సంఘర్షించుకొంటున్న రెండు ఏఐఏడిఎంకె గ్రూపుల కలయికతో బిజెపి అనుకూల ప్రభుత్వం ఏర్పడింది. 'కేంద్రంలో మిమ్మల్ని బలపరుస్తాం; రాష్ట్రంలో మమ్మల్ని అస్థిరపరచకండి' అన్న అవగాహనతో ఒడిస్సా, తెలంగాణా, ఏపి ప్రభుత్వాలు ఆరంభించినా, ఈ రాష్ట్రాలలో కూడా అధికారాన్ని చేజిక్కించు కోవాలన్న బిజెపి కోరికలు, ప్రయత్నాలు వాటిపని అవి చేసుకుంటూ పోతున్నాయి. ఒడిస్సాలో బిజెడి, బిజెపి నేడు అధికారంకోసం తీవ్రంగా తలపడుతున్నాయి. స్నేహం వెల్లివిరిసిన టిడిపి, బిజెపి సంబంధాలు, మంత్రులు రాజీనామాలు చేసేదాకా వెళ్లాయి. కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గొప్పగా పొగిడిన టిఆర్‌ఎస్, బిజెపియేతర, కాంగ్రేసేతర కూటమి, ప్రభుత్వం ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నది.

బిజెపి అవినీతి వ్యతిరేక పోరాటాన్ని ఒక పెద్ద ఫార్సుగా మార్చివేసింది. ఈ కాలంలో బయటపడిన కుంభకోణాలు అనేకం. నేరాలకు పాల్పడినవారు (నీరవ్‌మోడీతోసహా) తమ కళ్ల ముందే విదేశాలకు తప్పించుకొనిపోతే బాధ్యత తనది కాదంటుంది. కాంగ్రెసు హయాంలోనే ఈ కుంభకోణం మొదలయ్యిందంటూ చేతులు దులుపుకుంటుంది. పీకలదాకా అవినీతిలో మునిగితేలిన ఎడ్యూరప్ప కర్నాటక ముఖ్యమంత్రి అభ్యర్థి ఎలా కాగలడు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పరు. కాంగ్రెసు అవినీతిని ఏకరువు పెడ్తారు. కులాన్ని, మూఢవిశ్వాసాలను, అబద్ధాలను ఎన్నికల్లో వుపయోగించుకొనడంలో బిజెపి గొప్ప నేర్పరిగా తన్నుతాను నిరూపించుకొంటున్నది. బిజెపి పాలనలో ఎన్నికల ప్రచారపు తీరు నేలబారు స్థాయికి దిగజారిపోయింది. తాత్కాలిక ఉద్వేగాలను, దురభిప్రాయాలను, అపవిశ్వాసా లను, ఉన్మాదాలను రేకెత్తించడం, ఒక వాస్తవాన్ని తారుమారుచేస్తే ఆ క్షణానికి లాభిస్తుందనుకొంటే, ఎలాంటి సంకోచం లేకుండా దానికి పూనుకొనడం, వాటిని ఓట్లుగా మలుచుకొనడం ఒక కళగా అభివృద్ధిచెందింది.

బిజెపి ప్రభుత్వం-కార్మికులు, రైతాంగం, గిరిజనులు, యువకులు, మహిళలు, దళితులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదు. మొదట కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించి, నిరుద్యోగ సమస్యను తుద ముట్టిస్తామంది. కొద్దిరోజుల్లోనే మాటమార్చి, నిపుణుల తయారీకి శిక్షణయిస్తాననీ, విదేశాల్లో వారికోసం ఉద్యోగాలు కాచుకొని వున్నాయని వూరించడం మొదలెట్టింది. ఇప్పుడు అసలు ఉద్యోగాలెందుకు, స్వయం ఉపాధికోసం ప్రయత్నించవచ్చుకదా! అంటూ కోట్లాది నిరుద్యోగ యువకుల ఆశలపై నీళ్లు చల్లడానికి సిద్ధపడింది. యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తప్పించుకొనే ప్రయత్నమిది.

భూమిలేని, పేద రైతులకు, పేద కౌలుదార్లకు భూమిపై హక్కులు లేవు. అడవి ప్రాంతాల్లో భూములపైనా, ఫారెస్టు సంపదల పైనా, ప్రకృతి వనర్లపైనా గిరిజనుల సహజమైన హక్కులపైనా నిరంతర దాడులు సాగుతున్నాయి. తీరప్రాంతాల ప్రజలు, చేతివృత్తులు

చేసే శ్రమ జీవులు తమ సహజమైన, సాంప్రదాయకమైన జీవనాధారాలను కోల్పోతున్నారు. విదేశీ, స్వదేశీ బడాపెట్టుబడిదారులు ప్రభుత్వాల అండదండలతో పెద్దఎత్తున సాగిస్తున్న భూఆక్రమణలు, ప్రకృతి సంపదల లూటీలు పేదప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. కోట్లాది జనం పనుల కోసం పట్టణాలకు, యితర రాష్ట్రాలకు తరలి వెళ్లాల్సిన స్థితిని కల్పిస్తున్నాయి.

రైతాంగం అత్యంత దయనీయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. విపరీతంగా పెరిగిన వ్యవసాయ ఖర్చులతో, వ్యవసాయోత్పలను కొనేవాడు లేక, గిట్టుబాటు ధరలేక, మోయలేని రుణభారాలతో నలిగిపోతున్న రైతులు లక్షలాదిగా ఆత్మహత్యలకు పాల్పడడం పాలకుల విధానాలు సృష్టించిన దారుణ దృశ్యం. ఈ కాలంలో, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, పంజాబు, ఆంధ్ర, తెలంగాణా, ఒడిస్సా రాష్ట్రాలలో లక్షలాది రైతులు గిట్టుబాటు ధరలకోసం, రుణవిముక్తికోసం నిరసనోద్యమాల లోకి దిగారు. లాఠీదెబ్బలు, భాష్పవాయు ప్రయోగాలను, కాల్పులను చవిచూశారు. మధ్యప్రదేశ్‌లో కొందరు కాల్పుల్లో మృతి చెందారు. బిజెపి ప్రభుత్వం అత్యంత నిరంకుశంగా ప్రజలపై రుద్దిన నోట్ల రద్దు, జిఎస్‌టి ప్రజలకు తీవ్రమైన యిబ్బందులను, ఆర్థిక విధ్వంసాలను తెచ్చిపెట్టాయి.

భారత పాలకులు సామ్రాజ్యవాదులతో వేసుకొన్న పీటముడి ఈ కాలంలో మరింత బిగిసింది. ప్రత్యేకించి, అమెరికా – జపాన్ – ఆస్ట్రేలియా దేశాల కూటమిలో చేరడానికి భారత పాలకులు సిద్ధపడడం అన్నది భారతదేశానికి, భారత ప్రజలకు అత్యంత ప్రమాదకర పరిణామం. ఆసియా, ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్యాన్ని నెలకొల్పడం ఈ కూటమి వ్యూహాత్మక లక్ష్యం. ఈ కాలంలో, అమెరికా సామ్రాజ్యవాదులను సంతృప్తిపరిచే ప్రయత్నంలో భారత పాలకులు చాలాదూరమే ప్రయాణం చేశారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా అమెరికా, భారత రాజకీయ, మిలిటరీ, భద్రతా, విదేశాంగ కార్యకలాపాలను మలచడం, సమన్వయం చేయడం; దక్షిణాసియా దేశాల పాలకులను ఈ లక్ష్యానికి అనుగుణంగా కూడగట్టడం; దీనికి అవరోధంగా నిలిచిన చైనా ప్రభావం ఈ ప్రాంతంలో బలపడకుండా చూడడం భారత పాలకుల 'కర్తవ్యాల'లలో ఒక భాగం. మధ్యఆసియాలో అమెరికా ఆధిపత్య వ్యూహానికి ఒక పనిముట్టుగా వున్న ఇజ్రాయిల్ పాలకులతో భారత పాలకులు పెంచుకొంటున్న ప్రత్యేక సంబంధాలు దీనికనుగుణ్యమైనవే. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా సామ్రాజ్యవాదులకు భారత పాలకులు అందిస్తున్న తోడ్పాటు కూడా దీనిలో భాగమే.

ఈ విధంగా కాంగ్రెసు చెప్పుల్లో కాళ్లు దూర్చిన బిజెపి పాలకులు భారతదేశాన్ని అత్యంత హానికరమైన దారిలో నడిపిస్తున్నారు.

బిజెపి, సంఘపరివార్ శక్తులు హిందూ రాజ్యం; హిందుత్వ; భారతీయ సంస్కృతి, పూర్వవైభవం, జాతీయతలాంటి పేర్ల చాటున అత్యంత అశాస్త్రీయమైన, తిరోగామిశీలమైన, విచ్ఛిన్నకరమైన భావజాలాన్ని, సంస్కృతిని, ఫాసిస్టు తరహా ధోరణులను దేశంలో వ్యాపింప జేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాటికి భిన్నమైన భావజాలాలను, సంస్కృతిని, వారసత్వాలను తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఐతే, సామ్రాజ్యవాదులకు దేశప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను అమ్మివేస్తున్న తమ విధానాల నుండి, ప్రజల సమస్యలకు కారణమైన తమ దోపిడీ విధానాల నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించడానికి ఒక సాధనంగా వీటిని వుపయో గిస్తున్నారన్న వాస్తవాన్ని యిక్కడ మరిచిపోరాదు. సామ్రాజ్యవాదులకు దేశ ప్రయోజనాలను అమ్మి వేస్తున్న బిజెపి పాలకుల విధానాలకు వ్యతిరేకంగా భారత ప్రజలు చేస్తున్న, చేయవలసిన పోరాటంతో బిజెపి, సంఘపరివార్‌లు అమలుజరుపుతున్న హిందూత్వకు వ్యతిరేకంగా ప్రజలు సాగించే పోరాటాన్ని మనం జోడించాల్సివుంటుంది. అలా జోడించకుండా హిందూత్వ విధానాలకు వ్యతిరేకంగా సాగించే నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు బలహీనంగా, పైపై పోరాటాలుగా వుండిపోతాయన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. బిజెపి కోరుకుంటున్నట్లుగా అసలు సమస్యలనుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టించే ధోరణి చట్రంలోనే అవి పరిభ్రమిస్తాయన్న విషయాన్ని కూడా గుర్తించాలి.

అఖిల భారత స్థాయిలో ప్రతిపక్ష స్థానానికి దిగిపోయిన కాంగ్రెసు పార్టీకి ఆర్థిక విధానాల విషయంలో, సామ్రాజ్యవాదులకు వూడిగం చేయడం, అమెరికా సామ్రాజ్యవాదుల ఆధిపత్య వ్యూహంలో ఒక భాగంగా వుండడంలాంటి విషయాలలో బిజెపితో ఎలాంటి మౌలిక విభేదాలూ లేవు. నిజానికి బిజెపి ప్రభుత్వం చేస్తున్నదల్లా కాంగ్రెసు విధానాలను కొనసాగించడమే. కనుక ఈ మౌలిక విధానాలు వారికి చర్చనీయాంశాలు కావు. అందుకే, పార్లమెంటు వేదికల్లో కూడబలుక్కున్నట్టుగానే అధికార–ప్రతిపక్షాలు ఈ విధానాలపై చర్చను దాటవేస్తారు. కాంగ్రెసు కోరుతున్నదల్లా ఈ విధానాలను అమలుచేయడానికి కోల్పోయిన అధికారాన్ని తిరిగి చేజిక్కించుకోవాలన్నదే. వీరి ప్రతిపక్ష సారాంశం యిదే. అందుకే, అన్ని సందర్భాలలోనూ ప్రజల దృష్టిని అప్రధాన విషయాలవైపుకి మళ్లిస్తారు. ప్రజల దృష్టిని తక్షణం ఆకర్షించే విషయాలపైన, ఘర్షణలపైన గొంతు విప్పుతారు. చిల్లర విషయాలపట్ల తగాదాలు, కీచులాటలు, కేకలతో కాలం గడుపుతారు. ప్రజల అసంతృప్తిని ఎన్నికల్లో వోట్లుగా ఎలా సొమ్ముచేసుకోవాలి అన్నదే అన్ని సందర్భాల్లో వారి తపన, ప్రయాస అంతా.

బిజెపి, సంఘపరివార్‌ల హిందూత్వను వ్యతిరేకిస్తున్నట్లు వీరు చెప్పుకొంటారు. కాని హిందూత్వవాదుల దూకుడు చర్యలను ఎదుర్కొ నాల్సిన, నిలువరించాల్సిన చాలా సందర్భాలలో కాంగ్రెసు నాయకత్వం విశ్వసనీయంగా వ్యవహ రించలేదు. ఇప్పుడు, రాహుల్‌గాంధీ మొదలు కొని యితర నాయకులదాకా అంతా తమను తాము హిందూమతస్తులుగా ప్రదర్శించు కొనడానికి ప్రయత్నిస్తున్నారు. బిజెపి, సంఘ పరివార్‌ల మాదిరిగా దూకుడు, మొరటు హిందూత్వవాదులం కాదనీ, సున్నితంగా, జాగ్రత్తగా, నేర్పుగా హిందూ మతవ్యాప్తికోసం ప్రయత్నించేవారమని నిరూపించుకొనడానికి కుస్తీలు పడుతున్నారు. ఆవిధంగా ఎన్నికల్లో తమ 'వాటా' హిందువుల వోట్లు రాబట్టుకొనడానికి చేసే ప్రయత్నంలో యిది ఒక భాగమే.

కేంద్రంలో సుదీర్ఘకాలంపాటు కాంగ్రెసు ఏకచ్ఛత్రాధిపత్యం చెలాయించిన కాలంలో కేంద్రం అధికారాలనన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకొన్నదనీ, రాష్ట్రాలపట్ల వివక్ష, పెద్దన్న వైఖరి ప్రదర్శిస్తున్నదనీ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు నిరసనలు, ఆందోళనలు సాగించాయి. కాని ఈ నిరసనలు, ఆందోళనలు నిజమైన అర్థంలో ఒక ఫెడరల్ వ్యవస్థను సాధించడానికి వుద్దేశించిన పోరాటాల రూపం తీసుకోలేదు. మౌలికంగా ప్రత్యామ్నాయ విధానాలను రంగం లోకి తీసుకొని రాలేదు. కాంగ్రెసు వ్యతిరేక కూటమిగా ఏర్పడి, కేంద్రంలో అధికారం చేపట్టడం, ఒక ప్రధాన పాలకవర్గ పార్టీని ఆశ్రయించి కేంద్రంలో అధికారంలో పాలుపంచుకొనడం, కొన్ని రాయితీలను పొందడంగా యివి ముగిశాయి. ఈ ప్రాంతీయ పార్టీలకు ప్రధాన పార్టీలతో ఎలాంటి మౌలిక విభేదాలు లేవు. భూస్వామ్య, బడాబూర్జువా వర్గాల ప్రయోజనాలకోసం పని చేయడం, విదేశీ పెట్టుబడులను, భారత కార్పోరేటు సంస్థల పెట్టుబడులను రాబట్టు కొనడానికి ప్రయత్నించడం వీరి విధానంగా రూపొందింది. ప్రజల దృష్టిని ఆకట్టుకొనడానికి, మభ్యపెట్టడానికి వీరు అప్పుడప్పుడూ కేంద్రం తమ రాష్ట్రంపట్ల వివక్ష చూపుతున్నదనీ, అన్యాయంగా వ్యవహరిస్తున్నదనీ అలకలు, చిరుకోపాలు ప్రదర్శిస్తుంటారు. అదేవిధంగా నీటి పంపకపు వివాదాలు అప్పుడప్పుడూ రాష్ట్రాల ప్రజలమధ్య పరస్పర వ్యతిరేకతలను, ఉద్వేగాలను, ఉద్రిక్తతలను రగుల్కొల్పడాన్ని చూస్తాము. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు లేదా పాలకవర్గ సెక్షన్లు తమ తమ రాష్ట్రాల న్యాయమైన హక్కుల కోసం ముందు పీటీన నిలిచిన వారుగా ప్రదర్శించుకొనడం చూస్తాము. ఐతే, ఈ వివాదాలు హేతుబద్ధంగా, సంపూర్ణంగా పరిష్కరించడంపట్ల పాలక వర్గాలకు ఆసక్తి లేదు. వీటిని కొనసాగించడంలో వారి ప్రయోజనాలు వారి కున్నాయి. నష్టపడేదీ, కష్టాలు అనుభవించేది మాత్రం రెండువైపులా వున్న ప్రజలు మాత్రమే,

దశాబ్ద కాలానికి పైగా తెలంగాణా రాష్ట్రసమితి(టిఆర్ఎస్) నాయకత్వాన సాగిన ప్రత్యేక తెలంగాణా ఆందోళన ప్రజలెదుర్కొంటున్న ఏ వొక్క మౌలిక సమస్యనూ స్పృశించ లేదు. అంతేకాదు; ప్రజల దృష్టిని ఆ సమస్యల నుండి పక్కదారి పట్టించింది. టిఆర్ఎస్ నాయకత్వం వీరోచిత తెలంగాణా రైతాంగ పోరాటానికి మసి పూయడానికి పూనుకొన్నది. ఆ పోరాటంలోనూ, యింకా యితర భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లోనూ (అయిలమ్మ, దొడ్డి కొమరయ్య, కొమరం భీం వగైరా) నేలకొరిగిన యోధులను ప్రత్యేక తెలంగాణా వాదానికి వన్నెతెచ్చిన వారుగా చిత్రించడానికి పూనుకొన్నది. వేలాది రైతుబిడ్డలను రక్తపుటేరుల్లో ముంచిన నిజాం పాలకుడిని, తెలంగాణాను అభివృద్ధిచేసిన గొప్ప పరిపాలకుడిగా ఆకాశానికెత్తింది. ప్రగతిశీల భావాలుగల ఎందరో రచయితలను, కవులను, చరిత్రకారులను, కళాకారులను ప్రత్యేక తెలంగాణావాదులతో కలగాపులగంచేసి, వారి ఆలోచనలను, కృషిని వక్రీకరించడానికి ప్రయత్నించింది. ఒకవైపున కమ్యూనిస్టు భావాలకు కాలదోషం పట్టిందంటూనే మరో వైపున కమ్యూనిస్టులను, విప్లవకారులను ప్రత్యేక తెలంగాణా ఆందోళనకు వినియోగించు కొనడానికి ప్రయత్నించింది. తెలంగాణాలో అధికారం చేపట్టిన తర్వాత, కాంగ్రెసు, టిడిపి నాయకులలో సాధ్యమైనంత ఎక్కువమందిని టిఆర్ఎస్‌లోకి రాబట్టుకొని, రాష్ట్రంలో యితర పార్టీల అవసరం లేదనీ, అన్నీ తానేనన్న రీతిలో పాలనకు పూనుకొన్నది. ప్రజల హక్కులను, ఆందోళనలను పాశవికంగా కాలరాయడానికి పూనుకొన్నది. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి నుండి యిబ్బందులు లేకుండా చూసుకొన డానికి, కేంద్ర నిధులను, విదేశీ పెట్టుబడులను రాబట్టుకొనడానికి బిజెపి ప్రభుత్వాన్ని సమర్థించే వైఖరి తీసుకొన్నది. ఒక పాలకవర్గ పార్టీగా రాజకీయ చిత్రపటంలో స్థిరపడడానికి తీసుకొన్న చర్యలే యివన్నీ.

ప్రత్యేక తెలంగాణా ఆందోళనలో చేరి పోయిన కమ్యూనిస్టులు, విప్లవకారులు రాజకీయంగా తమ ఉనికిని విస్మరించే విధంగా వ్యవహరించారనేది ఒక వాస్తవం. తాము "సామాజిక" లేదా "ప్రజాతంత్ర" తెలంగాణాను కోరుతున్నట్లుగా కొందరు చెప్పినప్పటికీ, తాము అమలుపరచదలిచిన ప్రణాళికలను ప్రకటించి నప్పటికీ, వారంతా ఆచరణలో టిఆర్ఎస్ నాయకత్వం రూపొందించిన, నడిపిన ప్రత్యేక తెలంగాణా నినాద చట్రంలోనే పరిభ్రమించారు. కొందరు కళాకారులు కళారూపాలతో ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని ప్రచారంలో పెట్టారు. కవులు కవితలు, పాటలు వ్రాశారు. కొందరు మేధావులు ప్రాంతీయ, కులతత్వాలకోణం నుండి చరిత్రను, సాహిత్యాన్ని, ఉద్యమాలను విశ్లేషించడానికి, ప్రత్యేక తెలంగాణా వాదానికి బలం చేకూర్చడానికి ప్రయత్నించారు. శ్రామిక వర్గ దృష్టిని, వర్గరాజకీయాలను ప్రక్కన పెట్టి నప్పుడు యింతకన్నా చేయగలిగేది ఏమీ వుండదు. ఇక్కడ సమైక్య రాష్ట్రాన్ని సమర్థించడమా? లేక ప్రత్యేక తెలంగాణాను సమర్థించడమా అన్నది సమస్యే కాదు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం అన్నది కమ్యూనిస్టులకు ప్రధాన మైనది. ఒకానొక పరిస్థితిలో ప్రజలకు నాయకత్వం అందించే చొరవ పాలకవర్గ సెక్షన్ల చేతుల్లోకి వెళ్లవచ్చును. ఆ పరిస్థితుల్లో కూడా ప్రవాహంలో పడి, దానితోపాటు కొట్టుకొని పోవడం మనం చేయవలసిన పనికాదు. మనం మన రాజకీయ విధానాలకు, ప్రజల మౌలిక ప్రయోజనాలకు కట్టుబడివుంటూ ప్రజలమధ్య పనిచేస్తే దాని ఫలితాలు ఉపయోగకరంగా వుంటాయి. తెలంగాణాలో అధికారం చేపట్టిన టిఆర్ఎస్, పాలకవర్గ పార్టీ అన్నది స్పష్టం. ఈ స్పష్టత వున్నప్పుడు, ఈ ప్రభుత్వం అమలుచేస్తున్న పాశవిక అణచివేత విధానాలు; ఎదురుకాల్పుల పేరిట చేస్తున్న హత్యాకాండలు, అభివృద్ధి నిరోధక భావవిన్యాసాలు, విదేశీ పెట్టుబడులకోసం దేబిరింపులు, హిందూమతతత్వ కార్యకలాపాల ప్రదర్శనలు ఎవరినీ ఆశ్చర్యపరచవు. వీటికి వ్యతిరేకంగా సమస్యల విషవలయంలో చిక్కుకొని వున్న ప్రజలను సంఘటితపరచడం ఎలా అన్నదే మన ముందున్న సమస్య.

ఒకవైపున విభజనను ఆమోదిస్తూనే, మరో వైపున తాను విభజనకు వ్యతిరేకం అన్నట్లుగా భావం కల్గించడానికి చంద్రబాబు, టిడిపి ప్రయత్నించారు. టిడిపి కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వంలో చేరింది.

హైదరాబాదు 10 ఏళ్ళపాటు ఉమ్మడి రాజధానిగా వాడుకొనడానికి అవకాశం వున్నా కాదని, కొత్త రాజధానికోసం పెద్దఎత్తున భూసేకరణ, భారీ పథకాలు, డిజైన్లు వేయడానికి చంద్రబాబు మొదలెట్టాడు. దీనికోసం రైతుల సారవంతమైన పంటపొలాల విధ్వంసానికి పూనుకొన్నాడు. విభజన చట్టంలో హామీ యిచ్చి నట్లుగా ఏపికి "ప్రత్యేక హోదా" యివ్వాలంటూ కొన్నాళ్లు; "ప్రత్యేక

పాకేజి" చాలు అని మరి కొన్నాళ్లు; "ప్రత్యేక హోదా" యిచ్చి తీరాల్సిందేనని యిప్పుడు చంద్రబాబు, టిడిపి తమ వైఖరులు మార్చుకుంటూ వచ్చారు. కేంద్రం మాట నిల్పు కోలేదనీ, వివిధ ప్రాజెక్టులకు నిధులివ్వకుండా నూతన రాష్ట్రాన్ని యిబ్బందులపాలు చేసిందని నిరసిస్తూ కేంద్రమంత్రి పదవులకు రాజీనామా యిచ్చారు. ఇప్పుడు ప్రత్యేక హోదా అన్నది అధికార, ప్రతిపక్ష పార్టీలన్నిటికీ రాష్ట్ర సమస్యలకు దాదాపు ఏకైక పరిష్కారంగా కనిపిస్తున్నది.

ఇక్కడ గమనించాల్సింది, ప్రత్యేక హోదా అన్నది రాష్ట్రాన్ని ఆర్థికంగా కేంద్రంపై పూర్తిగా ఆధారపడే స్థితిలోకి నెడ్తుంది. దీనివల్ల లభించే పన్ను రాయితీలు ఎన్ని కంపెనీలను, ఎంత పెట్టుబడిని ఆకర్షించగలుగుతాయనేది, ఎందరికి ఉద్యోగావకాశాలను కల్పించగలుగుతాయనేది ప్రశ్నార్థకమే. పాలకవర్గ పార్టీలకు సంబంధించి నంతవరకు యిలాంటి నినాదాలు, వివాదాలు– రాష్ట్రప్రజల దృష్టిని నిజమైన సమస్యలనుండి పక్కదారి పట్టించడానికి; సమస్యలను పరిష్కరించ లేని పాలకులు తమ అశక్తతను కప్పిపుచ్చు కొనడానికి; ప్రజలను భ్రమల వలయంలో బంధించడానికి మాత్రమే ఉపయోగపడతాయి.

ఈ కాలంలో టిడిపి ప్రభుత్వం ప్రజల హక్కులను, ఆందోళనలను కాలరాసింది. నదీ వివాదాలను పరిష్కరిస్తానని, నదులను అను సంధానం చేస్తానని కాలక్షేపం చేసింది. ప్రాజెక్టుల పేరిట వేల ఎకరాల భూములనుండి ప్రజలను బేధఖలు చేసింది. పోలవరంతో సహా ప్రాజెక్టుల పేరిట నిర్వాసితులైన, భూములు కోల్పోయిన లక్షలాదిమంది గిరిజనులు, రైతులు సహాయాలు, పునరావాసాలు, జీవితాలకు భద్రతలేక నిస్సహాయ, దయనీయ స్థితిలో వున్నారు. పెట్టుబడులకోసం విదేశీ మరియు భారత పెట్టుబడిదారుల చుట్టూ ప్రదక్షణాలు చేయడం, సమావేశాలు జరపడం రాష్ట్రఅభివృద్ధికోసం చేస్తున్న గొప్ప కృషిగా ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నది.

రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ప్రధాన లక్ష్యంగా వుండాలన్నది సిపిఐ, సిపిఐ (ఎం)ల వైఖరి. ఎన్నికల్లో కాంగ్రెసుతో పొత్తు లేకుండా యిది సాధ్యంకాదన్నది సిపిఐ వైఖరి. కాగా, కాంగ్రెసుతో అఖిలభారత స్థాయిలో పొత్తుపెట్టుకోవాలా, లేదా అన్నది సిపిఐ(ఎం)లో ఒక వివాదాంశంగా నేడు ముందుకొచ్చింది. కాని పాలకవర్గ పార్టీలను ఎక్కువ లేదా తక్కువ ప్రమాదకరమైనవిగా వేరుచేసి చూడడం, ఒక పాలకవర్గ పార్టీతో ఎన్నికల పొత్తుకు దిగడం లేదా కేంద్రంలో ఒక పాలకవర్గ పార్టీని లేక కూటమి ప్రభుత్వాన్ని బలపరచడం సుదీర్ఘకాలం పాటు సిపిఐ(ఎం) అమలుజరిపిన విధానమే. ప్రజల మౌలిక సమస్యల ప్రాతిపదికగా పోరాటాలను ఆర్గనైజుచేయడం, ప్రజల సంఘటిత శక్తిపై ఆధారపడడం కాకుండా, అధికారానికి చేరువకావడానికి ఏదో ఒక పాలకవర్గపార్టీ లేదా దాని సెక్షన్లపైన ఆధారపడడం, వారికి తోకలుగా మారడం అనే రాజకీయాలనుండి తలెత్తుతున్నవే ఈ సమస్యలు.

నాలుగేళ్ళ కాలంలో నరేంద్రమోడి ప్రభుత్వం అమలుజరిపిన ఆర్థిక, రాజకీయ విధానాలు, దూకుడుగా అమలుజరిపిన హిందూత్వవాద, ఫాసిస్టు తరహా చర్యలు బిజెపి ప్రభుత్వంపట్ల ప్రజల అసంతృప్తిని పెంచాయి. ఈ మధ్య కాలంలో రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో కొన్నిచోట్ల గెలిచినప్పటికీ, మరికొన్ని చోట్ల వూహించని రూపంలో బిజెపి వోటములను, దెబ్బలను కూడా చవి చూసింది. అనేకచోట్ల బిజెపి, సంఘ పరివార్‌శక్తుల చర్యలు ప్రజల నిరసనను చవిచూశాయి. కొందరు హిందూమతోన్మాదులు చేస్తున్న ప్రేలాపనలు గట్టిగానే నిరసించబడు తున్నాయి. కార్మికులు, రైతాంగం, గిరిజనులు, దళితులు, విద్యార్థి – యువకులు, మహిళలు, ఉద్యోగులు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, కళాకారులు తమ సమస్యలపై ఆందోళనలకు దిగారు. ప్రత్యేకించి, రైతాంగం లక్షల సంఖ్యలో ఆందోళనలు సాగించారు. బిజెపి అనుకూల శక్తులు ఢిల్లీలాంటి పెద్ద పట్టణాల్లో ప్రగతిశీల, ప్రజాతంత్ర విద్యార్థుల బలమైన ఐక్య ఆందోళనలను ఎదుర్కొన్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికల్లో ఓటములనెదుర్కొన్నారు. దేశప్రజల ప్రయోజనా లను సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తున్న, ప్రజాస్వామిక హక్కులను, విలువలను, సాంప్రదాయాలను ధ్వంసంచేస్తున్న; దేశాన్ని మతపరంగా, సాంస్కృతికంగా చీల్చడానికి ప్రయత్నిస్తున్న నేటి పాలకులకు వ్యతిరేకంగా శక్తివంతమైన, నిశ్చయాత్మకమైన ఐక్యపోరాటం సాగించాలన్నది దేశంలో బలంగా వ్యక్తమవుతున్న ఆకాంక్ష. కార్మికులు, రైతాంగం, గిరిజనులు, విద్యార్థి–యువజనులు, మహిళలు, దళితులు, మైనారిటీలు పాలకవర్గాల ఎన్నికల అధికార జూదాలకు దూరంగా వుంటూ, ప్రజలను చీల్చడానికి, ప్రక్కదారి పట్టించడానికి పాలక వర్గాలు చేసే పన్నాగాలనుండి తమ హక్కులను, పోరాటాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలి. ఈవిధంగా దేశంలో పెంపొందే సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాతంత్ర చైతన్యం, ఐక్యత, పోరాటాలే శ్రామిక, పీడిత ప్రజలకు మంచి భవిష్యత్తును, నిజమైన విజయాన్ని గ్యారంటీ చేయగల్గుతాయనడంలో సందేహం లేదు.

**20-2-2018**

ooooo